సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



వైభవం.. గిరిజన సమ్మేళనం

విశాఖ : జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల యువతీ యువకులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గీతంలో జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో ఆదివారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

ఏపీ జేఏసీ అడ్వయిజర్‌గా శ్రీనివాసరావు



కాకినాడలో నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

రాజవొమ్మంగి: ఏపీ జేఏసీ అడ్వయిజర్‌గా స్థానిక బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్ ఎస్. శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం కాకినాడలో జరిగిన జాక్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఎంప్లాయీస్ వర్కర్స్, పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో ప్రకటించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వెంకటరమణయ్య, సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- తనిఖీ చేసిన ఉన్నతాధికారులు
- 585 మంది హాజరైనట్టు వెల్లడి



పాడేరులో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉన్నతాధికారులు శశికుమార్, రత్నకుమార్

పాడేరు: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో ప్రశాతంగా జరిగింది. పాడేరు డివిజన్‌లో రెండు, రంపచోడవరంలో మరో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 638 విద్యార్థులకు గాను 585 మంది హాజరయ్యారు. పాడేరు పట్టణంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్. శశికుమార్, జిల్లా నోడల్ అధికారి సీహెచ్ రత్నకుమార్ తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారని, అన్ని చోట్ల పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు తెలిపారు.

నేటి నుంచి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు బంద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయంలో జరిగే తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజల సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. పైన పేర్కొన్న తేదీల్లో సహస్ర నామార్చన, స్వర్ణపుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్యకల్యాణం సేవలు రద్దు చేశామన్నారు. అలాగే ఈనెల 15న వృశ్చిక దీపారాధన సందర్భంగా ఆరోజు రాత్రి 7గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

అన్నప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం రూ.4 లక్షల విరాళాన్ని నలుగురు దాతలు అందజేశారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన ప్రభల వెంకట భాస్కర సుబ్బారావు, ప్రబల వెంకట శేష ఆదిత్య కౌశిక్, ప్రభల వెంకట సుబ్బలక్ష్మి, మంగిపూడి ఉష రూ.లక్ష చొప్పున అందజేశారు. సంబంధిత చెక్కులను సింహగిరిపై ప్రోటోకాల్ సూపరింటిండెంట్ విక్రమ్‌కు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.



మిర్చికి ప్రత్యామ్నాయంగా గౌరిదేవిపేటలో సాగు చేస్తున్న పొగాకు

ఒకప్పుడు అన్నదాతకు కాసులు కురిపించి, ఎర్ర బంగారంగా పిలువబడే మిర్చి సాగు నేడు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా మిర్చి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మూడేళ్లుగా వరుస నష్టాలతో దిక్కుతోచని స్థితికి చేరిన రైతులు ఆ పంట సాగుకు స్వస్తి పలికారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు.



నెల్లిపాక సమీపంలో మిర్చికి ప్రత్యామ్నాయంగా సాగు చేస్తున్న మొక్కజొన్న

- గోదావరి, శబరి వరదలు, తెగుళ్లతో మిర్చి రైతు కుదేలు
- మూడేళ్లుగా పెట్టుబడి సైతం దక్కని వైనం
- గణనీయంగా తగ్గిపోయిన సాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించిన అన్నదాత

తెల్లబోయిన ఎర్ర బంగారం

పైరుకు తీవ్ర నష్టం కలిగించిన తామర పురుగులు

ఎటపాక: గత మూడేళ్లుగా వరుస విపత్తులు, తెగుళ్ల ముప్పేటదాడితో మిర్చి రైతు కుదేలయ్యాడు. కనీసం పెట్టుబడులు సైతం దక్కని పరిస్థితి నెలకొనడంతో ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోయి అప్పల ఊబిలో కూరుకుపోయాడు.

➡ జిల్లాలో మిర్చి సాగుకు చింతూరు డివిజన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. గోదావరి, శబరి వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత మిర్చి సాగు చేపట్టేవారు. ఇలా ఏటా డివిజన్ పరిధిలో మండలంలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో 13వేల ఎకరాల్లో సాగు జరిగేది. వీటిలో ఎటపాక మండలంలో నెల్లిపాక, తోటపల్లి, పిచుకలపాడు,రాయనపేట, గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు తదితర ప్రాంతాల్లో ఏడు వేల ఎకరాల్లో సాగు చేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెగుళ్ల కారణంగా కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. దీంతో తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతు ఆ పంటను సాగు చేయడం తగ్గించేశారు.

➡ ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. గత మూడేళ్లుగా తెగుళ్లు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఎర్ర నల్లి, తెల్ల నల్లి పైరుపై తీవ్ర ప్రభావం చూపడంతో వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఎన్ని పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకపోయింది. దిగుబడులపై వీటి ప్రభావం గణనీయంగా చూపింది.





నెల్లిపాక ప్రాంతంలో తెగులుబారిన పడిన మిర్చి పైరు (ఫైల్), తామర పురుగుల వల్ల దెబ్బతిన్న పూత

➡ పంట బాగా పండితే ఎకరాకు 25నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. మూడేళ్లుగా దిగుబడులు ఐదు క్వింటాళ్లకు పరిమితమయ్యాయి. దీంతో పెట్టుబడి నిమిత్తం చేసిన అప్పులకు కనీసం వడ్డీ కూడా చెల్లించలేకపోవడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.

➡ మిర్చి సాగుకు దూరమైన రైతులు ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించారు. మిర్చి పండించే భూముల్లో పొగాకు, మొక్కజొన్న, మినుము, కంది, పెసర పంటలు సాగు చేపట్టారు. నీటి సదుపాయం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో యూకలిప్టస్ పెంపకం చేపట్టారు.

➡ మిర్చి సాగును ఎక్కువ శాతం రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటారు. బాగా పండితే 25నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడి రూ.1.50 లక్షల వరకు అవుతుంది. మార్కెట్లో క్వింటా ఎండు మిరప రూ.20 వేల నుంచి 23 వేల వరకు ఉంది. గిట్టుబాటు ధర ఉంటే ఎకరాకు పెట్టుబడి పోను రూ.3లక్షల వరకు ఆదాయం ఉంటుంది. వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల ప్రభావం కారణంగా ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి రావడం లేదు.

కౌలు ధరలపై ప్రభావం

మిర్చిసాగుకు రైతులు దూరమవుతుండటంతో దీని ప్రభావం కౌలు ధరలపై చూపింది. సాగు విస్తీర్ణంలో 60 శాతం మంది రైతులు నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల వరకు కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటారు. కేవలం మిర్చి సాగు చేపడితేనే ఈ మేర కౌలు చెల్లింపునకు సాధ్యమవుతుంది. ఇప్పుడు మిర్చి పంట వేయకపోవడంతో కౌలుకు తీసుకునే వారే కరువయ్యారు.

ప్రత్యామ్నాయంగా..

➡ మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు 300, మొక్కజొన్న 600, మినుము 1,100, పెసర 100 ఎకరాల్లో వేశారు. మిగతా విస్తీర్ణంలో యూకలిప్టస్ తదితర ఇతర పంటలను సాగు చేపట్టారు.

తీవ్రంగా నష్టపోయా

ఎంతో ఆశతో సాగుచేసిన మిర్చి మూడేళ్లుగా నష్టాల ఊబిలోకి నెట్టింది. తామర పురుగుల బెడద ఎక్కువగా ఉండేది. రసం పీల్చేయడం వల్ల పైరు గిడసబారి ఎదుగుదల ఉండేది కాదు. దీనివల్ల దిగిబడి తగ్గిపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఈఏడాది 12 ఎకరాల్లో మినుము సాగు చేపట్టా.

– జంగాల లక్ష్మణరావు, రైతు, గౌరిదేవిపేట

పొగాకు సాగు చేపట్టా



మిర్చి సాగు మూడేళ్లుగా నష్టాలు మిగిల్చింది. పెట్టుబడులు కూడా దక్కలేదు. గత ఏడాది 8 ఎకరాల్లో మిర్చి సాగు చేసి దిగుబడులు రాకపోవటంతో తీవ్రంగా నష్టపోయా. దీంతో మిర్చికి బదులు పొగాకు సాగు చేపట్టాను. పైరు ఎదుగుదల బాగానే ఉంది. కలిసి వస్తాదన్న ఆశతో ఉన్నా.

– బి. శ్రీనివాసరావు, రైతు, జీకేపాడు

60 శాతం తగ్గిన సాగు విస్తీర్ణం



చింతూరు డివిజన్ వ్యాప్తంగా ఈఏడాది 60 శాతం మేర మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఏటా చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో 13వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. అయితే గోదావరి వరదల ప్రభావంతో మిర్చి పైరుకు తెగుళ్లు ఆశించి దిగుబడులు తగ్గాయి. దీంతో రైతులు సాగు విస్తీర్ణం తగ్గించేశారు. విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, కల్తీ విత్తనాలు వినియోగించడమే దిగుబడి తగ్గడానికి కారణం.

– కోలా ముత్తయ్య, హార్టికల్చర్ అధికారి, చింతూరు

వంజంగి హిల్స్ పరిసరాలను కలుషితం చేయొద్దు

ఎస్పీ అమిత్ బర్దర్



మారథాన్‌లో పాల్గొన్న ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ ప్రమోద్



వంజంగిలో సే నో టూ గంజా మారథాన్‌లో పాల్గొన్న పోలీసులు, పర్యాటకులు

పాడేరు: ప్రకృతి ఒడిలో పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన వంజంగి హిల్స్ పరిసరాలను సందర్శకులు కలుషితం చేయొద్దని ఎస్పీ అమిత్‌బర్దర్ సూచించారు. ఆదివారం నిర్వహించిన సే నో టూ గంజా మారథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్పీతోపాటు డీఎస్పీ ప్రమోద్, సుమారు 20 కమెండో పార్టీలు, వంద మందికి పైగా పౌరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటకులతో ఎస్పీ ముచ్చటించారు. పాల సముద్రాన్ని తలపించే వంజంగి మేఘాల కొండ అందాలు తనకు ఎంతో అనుభూతి ఇచ్చాయన్నారు. దేశ, విదేశాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి తరలి వస్తున్నారన్నారు. మేఘాల కొండపై పర్యాటకులు భారతదేశ జాతీయ జెండాలను ఆవిష్కరిస్తుండటం గొప్ప విషయమన్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులు స్థానిక గిరిజనుల సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడుతూనే అందాలను చూసి ఆస్వాదించాలన్నారు. పర్యాటకులు ఎవ్వరు కూడా నిషేధిత గంజాయి జోలికి వెళ్లవద్దని సూచించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను కొండపైకి తేవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాడేరు సీఐ దీనబంధు, ఎస్ఐ సూర్యనారాయణ, అధిక సంఖ్యలో పోలీసులు, పౌరులు, పర్యాటకులు పాల్గొన్నారు.

ముగిసిన మావోయిస్టుల వారోత్సవాలు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. దీంతో సరిహద్దు గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలకు మావోయిస్టులు పిలుపునివ్వడం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన సరిహద్దు పోలీసులు వారం రోజులుగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో కొత్తూరు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను పరిశీలించారు. అనుమానితుల వివరాలు సేకరించి, విడిచి పెట్టారు. దీంతో పాటు సరిహద్దు అంతా పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ నిర్వహించాయి. రహదారి పొడవునా కల్వర్టులు, వంతెనలను బాంబ్, డాగ్ స్క్వాడ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు తనిఖీలు చేశాయి. జోలాపుట్టు వెళ్లే నైట్‌హాల్ట్ బస్సులను మండల కేంద్రంలో నిలిపివేశారు.



కొత్తూరు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది



లంబసింగిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి: మండలంలోని మారుమూల ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి లంబసింగి జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. పర్యాటకుల ముసుగులో కొందరు మన్యం నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి తరలించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు.

నిర్వాసితులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

- సీపీఐ చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు విమర్శ
- వేలేరుపాడులో సదస్సును విజయవంతం చేయాలని పిలుపు




పోలవరం నిర్వాసితుల సమస్యలపై కరపత్రం విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కూనవరం: పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని సీపీఐ చింతూరు డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్‌రావు విమర్శించారు. నిర్వాసితుల డిమాండ్ల సాధనకు ఈనెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఏడు ముంపు మండలాల నిర్వాసితుల సమస్యలపై పెద్ద ఎత్తున నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, స్ట్రక్చర్ వ్యాల్యూ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. అల్లూరి జిల్లాలో కూనవరం, వీఆర్‌పురం, చింతూరు, ఎటపాక, ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వెలేరుపాడు ముంపు మండలాల్లోని నిర్వాసితులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లంబు శ్రీనివాస్, సూరం వెంకటేశ్వర్లు, గద్దల పాపయ్య, పొట్టాబత్తుల సురేష్, కోటరమణయ్య, యడ్ల చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో పర్యాటకుల సందడి

మన్యంలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. వీకెండ్ కావడంతో ఆదివారం దూరప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. వంజంగి మేఘాల కొండను సందర్శించిన అనంతరం పర్యాటకులు కొత్తపల్లి జలపాతానికి వచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. అరకు ప్రాంతంలోని చాపరాయి జలవిహారి, అంజోడాలోని అరకు పైనరీ, చాపరాయి జలపాతాలకు పర్యాటకుల తాకిడి నెలకొంది. కుటుంబాలతో తరలివచ్చి వన భోజనాలు నిర్వహించారు. వలిసె, పొద్దుతిరుగుడు పూల తోటల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు. – చింతపల్లి/ జి.మాడుగుల, పాడేరు రూరల్ (అరకులోయ రూరల్)/డుంబ్రిగుడ



అరకు పైనరీ ముఖద్వారం వద్ద పర్యాటకులు



చాపరాయి జలవిహారికి తరలివచ్చిన పర్యాటకులు



చాపరాయి జలవిహారి వద్ద పర్యాటకులు



అంత్రిగుడ జంక్షన్ సమీపంలో వంట చేస్తున్న పర్యాటకులు



అరకు పైనరీ వద్ద భోజనాలు చేస్తున్న సందర్శకులు



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

కంపాక్టర్ ఏర్పాటుతో ఫైళ్లు భద్రం



కంపాక్టర్‌ను పరిశీలిస్తున్న విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



ఆపరేటింగ్ చేస్తున్న విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ-1 అజిత వేజెండ్ల

అల్లిపురం (విశాఖ): నగర పోలీస్ కమిషనరేట్‌లోని సిటీ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో కంపాక్టర్‌ను విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీఎస్ఆర్‌లో భాగంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపాక్టర్‌ను అందించినట్లు తెలిపారు. రికార్డులకు నష్టం కలగకుండా, పాత రికార్డులను సులభంగా ట్రాక్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. చిన్న స్థలంలో ఎక్కువ రికార్డులను క్రమబద్ధంగా ఉంచేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. అల్మారాల్లో రికార్డులను అస్తవ్యస్తంగా డంప్ చేయాల్సిన పనిలేదన్నారు. హెచ్‌పీసీఎల్ సీఎస్సార్‌లో భాగంగా సిటీ స్పెషల్ బ్రాంచ్ నందు ఒకటి, సిటీ పోలీస్ ఆఫీసులో మరొక కంపాక్టర్‌ను అందించనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

ఏఐయూ సౌత్ జోన్ చెస్ చాంపియన్ మద్రాస్ యూనివర్సిటీ



ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా భారతీయ విశ్వవిద్యాలయ సంఘం (ఏఐయూ) సౌత్‌జోన్ పరిధిలోని అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా చదరంగం పోటీల్లో మద్రాస్ యూనివర్సిటీ జట్టు అసాధారణ ప్రతిభను కనబరిచి, చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో తమిళనాడుకు చెందిన అన్నా యూనిర్సిటీ, మూడో స్థానంలో కర్ణాటక విశ్వవిద్యాలయం, నాలుగో స్థానంలో ఏఎస్ఆర్ యూనివర్సిటీ, కేరళ విశ్వవిద్యాలయం నిలిచాయి. విజేతలకు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ ట్రోఫీని అందించారు.

1,250 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పెందుర్తి: స్థానిక ప్రశాంతినగర్‌లో అనధికారికంగా నిల్వ చేసిన 1250 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకుని ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.వి సతీష్‌కుమార్ తెలిపారు. ప్రశాంతినగర్‌లో నాగల్ల నాగేశ్వరరావు అనే వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. దీనిపై నిఘా ఉంచిన పౌరసరఫరాల అధికారులు ఆదివారం దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

తుమ్మపాల: అనకాపల్లి పట్టణంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ నెల 7న రాత్రి సమయంలో ఆటో డ్రైవర్‌పై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన నిందితుడిని పట్టణ పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ సీఐ విజయకుమార్ ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్‌ను గుర్తు తెలియని వ్యక్తి హత్యకు ప్రయత్నించడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై ఈశ్వరరావు సీసీ కెమెరాలు ఆధారంగా వెరిఫై చేసి నిందితుడిని గుర్తించారన్నారు. ఈ మేరకు పట్టణంలో పూల్‌బాగ్ జంక్షన్ వద్ద గవరపాలేనికి చెందిన దాడి అరుణ్‌కుమార్‌ను పట్టుకున్నామన్నారు.

ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ

- సెకండ్ రన్నరప్‌గా ఏపీఎస్ఆర్టీసీ
- ముగిసిన రోడ్ రవాణా సంస్థ అథ్లెటిక్ మీట్



ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ



సెకండ్ రన్నరప్‌గా నిలిచిన ఏపీఎస్ ఆర్టీసీ

విశాఖ స్పోర్ట్స్ : కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అఖిల భారత రోడ్ రవాణా సంస్థల అథ్లెటిక్ మీట్ ఆదివారం ముగిసింది. దేశంలోని 18 ఎస్టీయూలకు చెందిన క్రీడాకారులు మూడు రోజులపాటు పలు ట్రాక్ ఫీల్డ్ అంశాల్లో పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హాజరై విజేతలకు ట్రోఫీలతో పాటు మెడల్స్ ప్రదానం చేశారు. పలువురు ఆర్టీసీ జాతీయ స్థాయి ఆటగాళ్లను ఈ సందర్భంగా సత్కరించారు.

త్వరలో అన్ని ఎలక్ట్రికల్ వాహనాలే..

త్వరలోనే రాష్ట్రమంతటా ఎలక్ట్రికల్ వాహనాల్నే నడిపేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులకు ఉన్న అడ్డంకుల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఉండే రవాణా ఉద్యోగులు ఆరోగ్యం కాపాడుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. విజయనగరం జోన్ ఈడీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర, ఏఎస్ఆర్టీయూ డైరెక్టర్ ఆర్ఆర్ కిషోర్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కర్ణాటక ఆర్టీసీ సాధించగా, బెంగళూర్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రన్నరప్‌గా, ఏపీఎస్ఆర్టీసీ సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి.

చివరి రోజు పోటీల్లో విజేతలు

జావెలిన్ త్రో మెన్‌లో 47.60 మీటర్లు విసిరి వినోద్ కుమార్(బీఎంటీసీ), వుమెన్‌లో అంబికా నాగేష్(కర్ణాటక ఎస్టీసీ) 20.07 మీటర్లు విసిరి విజేతలుగా నిలిచారు. 400 మీటర్ల మెన్ పరుగులో సచిన్ శివప్రసాద్(ఎంఎస్ఆర్టీసీ), వుమెన్‌లో రాధ(కర్ణాటక ఆర్టీసీ), 100 మీటర్ల మెన్ రిలేలో ఏపీఎస్ఆర్టీసీ, వుమెన్‌లో బీఎంటీసీ జట్లు విజేతలుగా నిలిచాయి.

గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్



మాట్లాడుతున్న రూపావతి

దేవరాపల్లి: సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షల కోసం కోచింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి తెలిపారు. తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి, ఉత్తరాంధ్రకు చెందిన బాలురకు విశాఖలో గల శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలలో, బాలికలకు చీపురుపల్లి బాలికల విద్యాలయంలో సీట్లు కేటాయిస్తామని చెప్పారు. వారికి ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్ష రాయడానికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి వీలుగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

సంగీతం.. సాహసం.. సాగరతీరం

- అలరించిన తూర్పు నేవీ జాజ్ బ్యాండ్
- ఘనంగా సబ్‌మెరైన్ డే వేడుకలు



జాజ్ బ్యాండ్ సంగీత విభావరి

ఏయూక్యాంపస్: సంగీతానికి సాహసాన్ని జోడించారు. సహజ సిద్ధ వాతావరణంలో తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. బీచ్‌రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంగణంలో సబ్‌మెరైన్ డే సందర్భంగా తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన జాజ్ బ్యాండ్ ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఆదివారం సెలవుదినం కావడంతో పెద్దసంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు హాజరై, ఉత్సాహంగా తిలకించారు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు పాటలను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. భారత నావికాదళంలోకి 1967లో తొలి సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ కల్వరి చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 57వ సబ్‌మెరైన్ డేని ఘనంగా నిర్వహించారు. సందర్శకులను భారత జలాంతర్గాములకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగారు. వారికి తెలియని ఎన్నో విషయాలను వివరించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన : సబ్‌మెరైన్ డే సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన నగరవాసులను, చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు జలాంతర్గాములకు సంబంధించిన నమూనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫొటో ప్రదర్శన సైతం చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. జాజ్ బ్యాండ్ ఏర్పాటు చేసిన ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

300 లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారా పులుపు ధ్వంసం చేస్తున్న పోలీసులు

గొలుగొండ: చోద్యం గ్రామ పరిధిలోని బొడ్డేరు గెడ్డ సమీపంలో నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల పులుపును కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో సారా తయారీకి పులుపు నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో దాడి చేశామన్నారు. సారా తయారీ, అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

స్విమ్మింగ్ ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్ జిల్లా

- రన్నరప్‌గా విశాఖ జిల్లా
- శరత్, పావని వ్యక్తిగత చాంప్‌లు
- ముగిసిన ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా సాధించగా విశాఖ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు 24 స్వర్ణాలు, 22 రజతాలు, 13 కాంస్య పతకాలతో 199 పాయింట్లు సాధించగా, విశాఖ స్విమ్మర్లు 8 స్వర్ణాలు, 13 రజతాలు, 16 కాంస్యాలతో 95 పాయింట్లు దక్కించుకున్నారు.

- గ్రూప్–3 కేటగిరీ బాలుర విభాగంలో స్వామినాయుడు(ఏలూరు), త్రిభువనరెడ్డి(కడప) 23 పాయింట్లతో సముజ్జీగా నిలిచి వ్యక్తిగత చాంపియన్‌షిప్ పంచుకున్నారు. బాలికల్లో పార్థవి(కృష్ణా) 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించింది.
- గ్రూప్–2 కేటగిరీ బాలుర విభాగంలో కార్తికేయ దేవ(కడప), బాలికల్లో అవిఘ్న(బాపట్ల) చెరో 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించారు.
- గ్రూప్–1 కేటగిరీ బాలురలో శరత్, బాలికల్లో పావని, ప్రేమామృత సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్ అందుకున్నారు. వీరంతా ఎన్టీఆర్ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్నారు.

విశాఖ సాగరతీరంలోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో మూడు ఏజ్ గ్రూప్‌ల్లో జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో వాటర్ పోలోతో సహా 45 అంశాల్లో పోటీలు నిర్వహించారు. స్విమ్మర్లు ఆయా అంశంలో సాధించిన రికార్డు ఆధారంగా రాష్ట్ర జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు.

ఢీకొన్న రెండు బండరాళ్ల లారీలు

యలమంచిలి: యలమంచిలి మండలం సోమన్నపాలెం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం పాత జాతీయ రహదారిపై రెండు బండరాళ్లను తరలిస్తున్న లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోలుగుంట మండలం నుంచి రాంబిల్లి నేవీ ప్రాజెక్ట్‌కు నల్ల బండరాళ్లను తరలిస్తున్న రెండు లారీలు ఒక దాని వెంట ఒకటి వస్తున్నాయి. యలమంచిలి మండలం మర్రిబంధ శివారు సోమన్నపాలెం గ్రామం సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీకి.. కారు ఆకస్మికంగా అడ్డు రావడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతా లారీ ఒక్కసారిగా బోల్తాపడింది. ఇంతలో వెనుక వస్తున్న మరో బండరాళ్ల లారీ ముందు లారీని ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెనక లారీలో ఉన్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పాత జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. రూరల్ ఎస్ఐ ఉపేంద్ర సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోవులు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

నక్కపల్లి: గోవులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను నక్కపల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం నక్కపల్లి నుంచి తుని వైపు 8 గోవులను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వేంపాడు టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో గోవులకు మేత, తాగునీరు సదుపాయాలు కల్పించకుండా తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. వ్యాన్‌తో పాటు, డ్రైవర్‌ను, వాహన యజమానిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి'



హైకోర్టు న్యాయమూర్తులతో విశాఖ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖ లీగల్: అన్ని రంగాల్లో శరవేగంగా వృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌తో కలిసి విశాఖలో ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు. వారికి హైకోర్టు ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, అంతర్జాతీయ విమాన కేంద్రంగా, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు హైకోర్టు బెంచ్ ఆవశ్యకత ఉందన్నారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ రఘునందన్ రావు, జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఎం.జైసూర్యలను మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రాలు అందించారు. వీరి వెంట విశాఖ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నరేష్ తదితరులున్నారు.

తీరంలో పారా గ్లైడింగ్



కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోట్ షికార్, స్కూబా డైవింగ్ పర్యాటకులను అలరిస్తుండగా..ఇప్పుడు మరింత మధురానుభూతిని కలిగించేందుకు లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో ఆదివారం పారాగ్లైడింగ్ ట్రైల్ రన్ ప్రారంభమైంది. ఈ పారా గ్లైడింగ్‌పై విహరించడానికి ఒక్కొక్కరికి రూ. 2500 రుసుము వసూలు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 నిర్వహించనున్నామని, 300–500 మీటర్లు ఎత్తు వరకు ఎగురుతుందని పైలెట్ నిర్వహకులు దినేష్ తెలిపారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి'



కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలుపుతున్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని నగరవాసులు నినదించారు. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద రాధారంగ రాయల్ అసోసియేషన్, అక్కడి హిందువులకు సంఘీభావంగా కొవ్వొత్తులు వెలిగించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గాది బాలాజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో అన్యాయంగా అరెస్టు చేసిన ఇస్కాన్ స్వామీజీ చిన్మయ కృష్ణదాస్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ స్థానంలో బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. ఇది హిందువులపై జరుగుతున్న దాడిగానే ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. భారత ప్రభుత్వం చొరవ తీసుకుని చిన్మయ దాస్‌ని విడుదల చేయించేటా చూడాలన్నారు. శ్రీనివాసరావు, మహేంద్ర, గోవింద, శివకుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్సీపట్నం: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్‌రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. రామారావుపేటకు చెందిన గంగుబోగుల రామచంద్రరావు(58) తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈఘటనలో రామచంద్రరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

చోడవరం రూరల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరపు అశ్వని రెండో కాన్పులో పురిటి నొప్పులు రావడంతో ఆదివారం 108 వాహనంలో చోడవరం కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. టీచర్స్ కాలనీ వద్దకు 108 వాహనం చేరుకోగానే అశ్వని పురిటినొప్పులు భరించలేని రీతిలో ఉండడంతో వాహనంలో ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ ట్రైనర్ (ఈఎంటీ) అప్పలనాయుడు, వాహన పైలెట్ గణేష్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి, ఆమెకు ప్రసవం ఏర్పాట్లు చేశారు. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం క్షేమంగా ఉన్న తల్లీబిడ్డను చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

'కొండ'ంత విశ్వాసం

- కొండగుడికి పోటెత్తిన భక్తులు
- వేడుకగా మేరీమాత ఊరేగింపు
- దివ్య పూజాబలితో ఉత్సవాల ముగింపు



సెయింట్ అలాసిస్ స్కూల్ నుంచి మేరీమాత విగ్రహం ఊరేగింపు



ఊరేగింపులో క్రైస్తవులు

డాబాగార్డెన్స్: పాతపోస్టాఫీస్ ప్రాంతంలోని కొండగుడి(రోజ్‌హిల్) కొండపై కొలువైన అమలోద్భవి(విశాఖ పురి మేరీ) మాతను దర్శించుకునేందుకు క్రైస్తవులు తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా వచ్చిన భక్తులతో విశాఖ నగరం జనసంద్రమైంది. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలతో అణువణువూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు తరలి వచ్చి పరమత సహనానికి ప్రతీకగా నిలిచారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ కొండల జోసెఫ్, ఫాదర్ థామస్ పుల్లాట్, సెబాస్టియన్, ప్రశాంత్ జోషి తదితరులు నేతృత్వంలో, పోలీసుల బందోబస్తులో కొండగుడి పండగ ప్రశాంతంగా సాగింది.

భక్తి శ్రద్ధలతో దివ్య పూజాబలి

గత నెల 29న ప్రారంభమైన కొండగుడి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవాలయం వద్ద ఆంగ్లంలో, తెలుగులో వేర్వేరుగా దివ్య పూజ జరిపారు. అధిక సంఖ్యలో కన్యలు హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30కు గుహ వద్ద నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. మధ్యాహ్నం 1.30కు సెయింట్ అలాసిస్ స్కూల్ ఆవరణలో పరిశుద్ధ జపమాల, విశాఖపురి మేరీమాత తేరుతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రాజమండ్రి విచారణ కర్త దివ్యసత్ప్రసాద ఆరాధన చేశారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువుల తోపాటు, నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్‌లు, బ్రదర్స్ పాల్గొని, కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ దరి సెయింట్ అలాసిస్ స్కూల్ నుంచి అశేష ఆరాధకులు మేరీమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. వీరి సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని కొలువుంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేర బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొందరు తలనీలాలిచ్చి భక్తిని చాటుకున్నారు. లూర్థుమాత గుహ వద్ద దివ్య పూజాబలితో కొండగుడి ఉత్సవం ముగిసింది.

జోరుగా వ్యాపారం..

పాతపోస్టాఫీసు, కోటవీధి, ఫెర్రీరోడ్డు, అంబుసరంగ్ వీధి, కన్వేయర్ బెల్ట్ తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర దుకాణాలు వెలిశాయి. వీటిలో ఆధ్యాత్మిక గ్రంథాలు, కొండగుడి చరిత్ర, ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు కొలువుదీరాయి. మిఠాయిలు, శనగలు, ఖర్జూరం, కొవ్వొత్తుల వ్యాపారం జోరుగా సాగింది. పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండగుడి భక్తులకు పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు మహాన్నదానం చేశారు. తాగునీటి ప్యాకెట్లు అందించారు. డాక్టర్ జహీర్ అహ్మద్, మక్సూద్ అహ్మద్‌లు ప్రారంభించారు. కొన్నేళ్లుగా భక్తులకు మహాన్నదానం చేస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

SPOKEN ENGLISH
- ONLINE CLASSES BY REPUTED FACULTY, ATTEND FREE DEMO CLASS ON 13-DEC @ 8 AM & 6 PM. PH: 93932 82726, KIRAN SPOKEN ENGLISH. [A-1433]

Wanted
- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253940]
- ప్రైవేటు బ్యాంకులోకి 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech, Dip & IIT కావలెను. జీతం : 18-25K, Age : 35 లోపు, స్పాట్ జాయిన్. ఫోన్ : 79954 39539 [V- 6496]
- డైరెక్ట్ జాయినింగ్: ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో సూపర్‌వైజర్స్, స్టోర్ ఇన్‌ఛార్జి, అసిస్టెంట్స్, డ్రైవర్లు, (ITI, Dip. all) Ex.ఆర్మీ కా. రూం + భో, PF, ESI, జీ: 18-32 వేలు. © 94909 10876 [B-807206]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [HA-1388]

Real Estate

HOUS FOR SALE
- Commercial New Building 30000 Sft @ Y-Junction, KUKATPALLY, Hyd, TG With MNC TENANT Rent 15 Lakhs Ph : 7675975236 [SCA24000763]

PLOT FOR SALE
- VUDA PLOTS వైజాగ్ & విజయనగరం చుట్టు ప్రక్కలలో గజం రేటు రూ. 10,500 నుండి .. 18,500 ఇన్‌స్టాల్‌మెంట్ & స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 961 461 7777 [V- 2731]

Services

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం